సాక్షి
సూర్యాపేట
సోమవారం, 1, సెప్టెంబర్, 2025



శ్రీధర్‌రెడ్డి కృషి అభినందనీయం
నిరక్షరాస్యత నిర్మూలనకు పటేల్ శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ కవి అందెశ్రీ అన్నారు. - 8లో



‘స్పీడ్’గా తపాలా సేవలు
తపాలా శాఖ స్పీడ్ పోస్ట్ సేవలకు శ్రీకారం చుట్టింది. ఈ సేవలు సోమవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	586.70 అడుగులు
ఇన్‌ఫ్లో	:	3,41,558 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	3,05,551 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,130 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,019 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	5,156 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సీపీఎస్ రద్దు ధర్నాకు సంపూర్ణ మద్దతు

సూర్యాపేటటౌన్ : సీపీఎస్ రద్దు కోసం సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాకు మోడల్ స్కూల్ పీఎంటీఏ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగాని రాజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ జిలాని, రాష్ట్ర బాధ్యుడు గుర్రాల సోమయ్యగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి సీపీఎస్‌కు బదులు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికావు



హౌస్ అరెస్ట్ అయిన శ్రీలతారెడ్డి, నాయకులు

నేరేడుచర్ల : దేశ ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం నేరేడుచర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని ఆయన తల్లిని అవమానించే విధంగా రాహుల్ గాంధీ వాఖ్యాలు చేయడం భారతీయ సంస్కృతికి విరుద్ధంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అరెస్ట్ అయిన వారిలో నేరేడుచర్ల, పాలకవీడు మండలాల అధ్యక్షుడు నాగిరెడ్డి, నర్రినాయక్, నాయకులు సత్యనారాయణ, రమేష్, నరేందర్‌రెడ్డి, ఏమిరెడ్డి శంకర్‌రెడ్డి, కాలం నాగయ్య ఉన్నారు.

పాలన వైఫల్యంతోనే మార్వాడీ గో బ్యాక్ నినాదం



మాట్లాడుతున్న దేవిడ్ కుమార్

సూర్యాపేట అర్బన్ : పాలన వైఫల్యంతోనే మార్వాడీ గో బ్యాక్ నినాదం వచ్చిందని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్, తెలంగాణ జన సమితి రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మార్జున్, సీపీఐ సీనియర్ నాయకుడు దంతాల రాంబాబు ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి ఎస్‌కే.నజీర్ ఆరోపించారు. ఆదివారం సూర్యాపేట పట్టణంలో నిర్వహించిన రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో జరిగిన ఘటనను పోలీసులు సకాలంలో పట్టించుకుంటే మార్వాడీ గోబ్యాక్ నినాదం వచ్చేంది కాదన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గంట నాగయ్య, అనంతల మధు, కునుకుంట్ల సైదులు, జనార్దన్ యాదవ్, కరీం, వెంకట్ యాదవ్, చామకూర నరసయ్య, నాగయ్య, నారబోయిన కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మరమ్మతులు సగమే!



కాగితరామచంద్రాపురం వద్ద కాల్వకట్టకు మరమ్మతులు చేసిన దృశ్యం

కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వ కట్టకు గండిపడి నేటికి ఏడాది

- ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో చేపట్టని మరమ్మతులు
- మట్టిపోసి మమ అనిపించిన అధికారులు
- అక్కడక్కడా అధ్వానంగా కాల్వకట్ట
- మళ్లీ గండ్లు పడే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన



గతేడాది సెప్టెంబర్ 1న కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వ కట్టకు గండిపడిన ప్రాంతం

నడిగూడెం : నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం గ్రామ పరిధిలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్టకు 132.500 కిలోమీటర్ వద్ద గతేడాది సెప్టెంబర్ 1న గండిపడిసోమవారంతో ఏడాది పూర్తి అవుతున్నా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. కొన్నిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో కాల్వకట్టకు మళ్లీ ఎక్కడ గండ్లు పడతాయోనని మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేవలం మట్టిపోశారు..
ఇసుక బస్తాలు పేర్చారు..

గతేడాది ఇదేనెలలో ఎడమ కాల్వకు నీటిని విడుదల చేశారు. అదే సమయంలో భారీ వర్షాలకు పాలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ కాల్వలోకి వెదురెక్కి వచ్చింది. ఈ క్రమంలో నీటి పారుదల శాఖ అధికారులు ఖమ్మం జిల్లా పరిధిలో రంగుల వంతెన వద్ద ఉన్న ఎస్కేప్ గేట్లు ఎత్తక పోవడంతో కాగితరామచంద్రాపురం గ్రామ సమీపంలో కాల్వ కట్టకు భారీగా గండి పడింది. దీంతో రామచంద్రాపురం రైతుల పొలాలు నీటమునిగి, వరద ప్రవాహంలో విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయి తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో కాల్వకట్ట అత్యవసర మరమ్మతలకు నీటి పారుదల శాఖ నుంచి నుంచి రూ.2.10 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో గండి పడిన ప్రాంతంలో 5.2 మీటర్ల ఎత్తు, 150 మీటర్ల పొడవునా కేవలం మట్టి పోసి ఇసుక బస్తాల వేసి కట్టకు అత్యవసర మరమ్మతులు చేయించారు. అయినప్పటికీ నేటికీ కాల్వకట్ట పూర్తి స్థాయి మరమ్మతులకు నోచుకోలేదు. గత వేసవిలోనూ లైనింగ్, సిమెంట్ కాంక్రీటు, ఫ్లోరింగ్ పనులు చేపట్టలేదు. ఇంకా ఆ ప్రాంతంతో పాటు, రామాపురం, చాకిరాల, సిరిపురం వద్ద ప్రధాన కాల్వ కట్ట అక్కడక్కడా బలహీనంగా ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఫలితంగా మళ్లీ పలుచోట్ల గండ్లు పడే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగుతున్న ఆధునీకరణ పనులు

నీటి పారుదల శాఖ పున:వ్యవస్థీకరణలో భాగంగా సాగర్ ఎడమ కాల్వ 74వ కిలోమీటర్ నుంచి 132.500 కిలోమీటర్ వరకు సూర్యాపేట జిల్లా పరిధిలోకి వచ్చింది. పైభాగంలో ఇప్పటికే 74 కిలోమీటర్ నుంచి 115 కిలోమీటర్ మునగాల వరకు రూ.29 కోట్లతో మేఘా సంస్థ ఆధ్వర్యంలో కాల్వ కట్ట ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి.

శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



గతేడాది మా గ్రామ సమీపాన సాగర్ ఎడమ కాల్వ కట్టకు గండి పడి వందల ఎకరాల్లో వరిపంట నష్టపోయాం. నేటికీ మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. కాల్వ కట్టకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

– చక్రాల వెంకన్న, రైతు, కాగితరామచంద్రాపురం

అంచనాలు సిద్ధం చేస్తున్నాం

మునగాలలోని 115 కిలోమీటర్ నుంచి నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం రంగుల వంతెన 132.500 కిలోమీటర్ వరకు పూర్తి స్థాయిలో శాశ్వత మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే మరోసారి సాగర్ ఎడమ కాల్వ కట్టకు గండ్లు పడకుండా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడతాం.

– రఘు, డీఈ, సాగర్ ఎడమ కాల్వ



చాకిరాల వద్ద బలహీనంగా ఉన్న కాల్వకట్ట



132 కిలోమీటర్ వద్ద కాల్వలో దెబ్బతిన్న ఫ్లోరింగ్

ఇంటర్‌లోనూ ముఖగుర్తింపు హాజరు

- విద్యార్థుల హాజరుశాతం పెంచడమే లక్ష్యంగా కొత్త విధానం
- రోజుకు రెండు సార్లు హాజరు
- గైర్హాజరైతే తల్లిదండ్రుల ఫోన్‌లకు సమాచారం
- అన్ని జూనియర్ కళాశాలల్లో అమలు



విద్యార్థి హాజరు నమోదు చేస్తున్న అధ్యాపకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షిస్తోంది. కాలేజీలకు ఉదయం వచ్చిన విద్యార్థులు మధ్యాహ్న భోజనం కోసం ఇంటికి వెళ్లి తిరిగి రావడం లేదు. మరికొందరు ఇంటి వద్ద కళాశాలకు వెళుతున్నామని చెప్పి సరిగా హాజరు కావడం లేదు. దీనిని అరికట్టి హాజరు శాతం పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముఖ గుర్తింపు హాజరు కోసం ప్రభుత్వం యాప్‌ను సిద్ధం చేసింది. ఈ హాజరు విధానం జిల్లాలో గతనెల 23నుంచి అమలు చేస్తున్నారు.

రోజుకు రెండు సార్లు

జిల్లాలోని ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. విద్యార్థుల హాజరును ముఖ గుర్తింపు ద్వారా తీసుకుంటున్నారు. యాప్ ద్వారా రోజూ ఉదయం, మధ్యాహ్నం హాజరు తీసుకుంటారు. ఒక వేళ విద్యార్థి హాజరు కాకుంటే వారి తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లకు మెసేజ్ వెళుతుంది. ఈ హాజరును కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈఓ, రాష్ట్ర అధికారులు పర్యవేక్షించనున్నారు.

3,003 మంది ఇంటర్ విద్యార్థులు

జిల్లాలో ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,003 విద్యార్థులు విద్యభ్యసిస్తున్నారు. వీరిలో ఫస్టియర్ 1,559 మంది, సెకండియర్ 1,444 మంది విద్యార్థులు ఉన్నారు. హాజరు నమోదు విధానంపై ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులు ప్లే స్టోర్ నుంచి పీజీ బీఐఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అధ్యాపకులు యాప్‌ను ఓపెన్ చేయగానే వారు ప్రతిరోజు ఉదయం బోధించే తరగతి, విద్యార్థుల వివరాలు కనిపిస్తాయి. విద్యార్థి పేరుపై క్లిక్ చేయగానే కెమెరా ఓపెన్ అవుతుంది. వెంటనే విద్యార్థి ముఖంపై క్లిక్ చేయగానే విద్యార్థి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

విద్యార్థులపై పర్యవేక్షణ పెరుగుతుంది



విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశ పెట్టింది. ఈ విధానం వల్ల విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరవుతారు. దీంతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. తరచూ కళాశాలకు హాజరుకాని విద్యార్థులపై పర్యవేక్షణ పెరుగుతుంది. వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు విద్యార్థులు క్రమంగా వచ్చే విధంగా చేయవచ్చు.

– బి.మృత్యుంజయ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, తిరుమలగిరి

గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- తాగునీటి వనరుల్లో విగ్రహాలు వేయకుండా చూడాలి
- మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తే చర్యలు
- టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించనున్నట్టు జిల్లా ఎస్పీ కె.నరసింహ తెలిపారు. ఆదివారం ఎస్పీ నరసింహ సూర్యాపేటలోని తన కార్యాలయం నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. నిమజ్జనాలు ఎక్కడ చేయాలి అనేది ముందుగా అవగాహన కల్పించాలన్నారురు. తాగునీటి కోసం వినియోగించే వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేయకుండా పోలీసులు చూడాలన్నారు. శోభాయాత్రలు నిర్వహిస్తూ దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేసుకోవడం మంచిదని సూచించారు. సాగర్, శ్రీశైలం, పాలేరు, తాగునీటికాల్వల్లో నిమజ్జనాలకు అనుమతి లేదన్నారు. మహిళలు, పిల్లలు నిమజ్జనం ప్రదేశాలకు వెళ్లవద్దని అన్నారు. మహిళా పోలీసులను నియమించాలన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించేలా..

15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యుల కోసం ‘ఉల్లాస్’

- జిల్లాలో 41,117 మంది గుర్తింపు
- 4,075 మంది వలంటీర్ల నియామకం
- చదువు చెప్పేందుకు త్వరలోనే సామాజిక చైతన్య కేంద్రాలు

సూర్యాపేటటౌన్ : సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్) పేరుతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. పాఠశాలలు అందుబాటులో లేక, ఇతర కారణాలతో చదువుకు దూరంగా ఉన్న 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులను గుర్తించి సామాజిక చైతన్య కేంద్రాల్లో అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశారు.

నిరక్షరాస్యుల గుర్తింపు.. వలంటీర్ల ఎంపిక పూర్తి

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లో 41,117 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వీరికి చదువు చెప్పడానికి 4,075 మంది వలంటీర్లను ఎంపిక చేశారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు (రిసోర్స్ పర్సన్‌లు) శిక్షణ ఇచ్చారు. వీరు మండల స్థాయిలో త్వరలోనే ప్రతి పంచాయతీ నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక వీఓఏకు శిక్షణ ఇస్తారు. వీరు వలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ వలంటీర్లు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు.

46 వేల పుస్తకాలొచ్చాయ్..

గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న సామాజిక చైతన్య కేంద్రాల్లో చదువుకునేవారికి పుస్తకాలు కూడా అందుబాటులో ఉంచారు. నిరక్షరాస్యుడితో పాటు ప్రతి వలంటీర్‌కు ఒక పుస్తకం చొప్పున 46 వేల పుస్తకాలు వచ్చాయి. వలంటీర్‌కు మార్గదర్శి, నిరక్షరాస్యులకు అక్షర వికాసం పుస్తకాలు ఉన్నాయి. ఇందులో పరిసరాలు, ఆర్థిక విషయాలు, నిత్య జీవన చిత్రాలతో కూడిన పాఠాలు ఉంటాయి. చిత్రాల ద్వారా చదువు నేర్పుతారు.



నిరక్షరాస్యుల కోసం ముద్రించిన అక్షర వికాసం పుస్తకం

త్వరలోనే కేంద్రాలు ప్రారంభం

నిరక్షరాస్యులను ఇప్పటికే గుర్తించి వారికి బోధించేందుకు వలంటీర్లను సైతం నియమించాం. త్వరలో గ్రామాల్లో సామాజిక చైతన్య కేంద్రాలను ప్రారంభిస్తాం.

– వై.రాంబాబు, జిల్లా సెక్టోరియల్ అధికారి

ఎన్ఆర్ఐ శరత్‌చంద్ర సేవలు ప్రశంసనీయం

- ఎస్పీ నరసింహ, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తంరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ, చిత్రంలో రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్

మద్దిరాల : జన్మభూమిపై మమకారంతో గ్రామస్తుల కోసం ఎన్ఆర్ఐ వేముగంటి శరత్‌చంద్ర అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ నరసింహ, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం మద్దిరాల మండలం కుక్కడం గ్రామంలో గ్రామానికి చెందిన వేముగంటి సుధాకర్‌రావు కుమారుడు ఎన్ఆర్ఐ వేముగంటి శరత్‌చంద్ర తన కుమారుడు ఆద్య కోరిక మేరకు గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్‌తో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. అమెరికాలో స్థిరపడినా సొంత ఊరి ప్రజల కోసం తన వంతుగా శరత్‌చంద్ర చేస్తున్న సేవలను కొనియాడారు. ఇప్పుడే కాదు కరోనా సమయంలో కూడా జిల్లాకు చెందిన డాక్టర్లతో మాట్లాడి అవసరమైన వారికి ఆక్సిజన్ సిలిండర్లను అందించారని, కుక్కడం గ్రామంలో కూడా అన్ని వర్గాల ప్రజలకు నిత్యావసర సరకులు సమకూరుస్తూనే వైద్యసేవలు అందించేందుకు ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. చిన్న వయస్సులోనే గొప్పగా ఆలోచించి వైద్యశిబిరం ఏర్పాటు చేయించిన శరత్ చంద్ర కుమారుడు ఆద్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐ నరసింహ, కుక్కడం గ్రామ మాజీ సర్పంచ్ ముక్కాల వాసుదేవరెడ్డి, నాయకులు ముక్కాల భూపాల్‌రెడ్డి, నాగెల్లి అరుణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలుమల్ల యాదవ్, మాజీ జెడ్పీటీసీ బానోత్ మంజుల మాన్‌సింగ్, పులుసు రామనర్సు, మద్దెల భిక్షపతి, మద్దెల రాములు, బానోత్ శ్రీనివాస్, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, చెవిటి వెంకన్న తదితరులు

1.63 లక్షల కుటుంబాలకు ధీమా

- రైతు బీమా పథకానికి ముగిసిన దరఖాస్తుల గడువు
- జిల్లా వ్యాప్తంగా 1,63,480 మంది నమోదు
- వచ్చే ఏడాది ఆగస్టు 14 వరకు బీమా వర్తింపు



నాగారం : రైతుబీమా పథకానికి ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 1,63,480 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల కాలంలో పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన వారు, గతంలో పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్నా పథకంలో చేరని వారు, 19 సంవత్సరాల వయస్సు నిండినవారు, సవరణల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గతనెల 13 వరకు అవకాశం కల్పించారు. రైతులు సమర్పించిన దరఖాస్తులను ఏఈఓలు గతనెల 14 వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. మరోవైపు 59 ఏళ్ల నిండిన వారిని పథకం నుంచి తొలగించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఏడాది పాటు రైతులకు బీమా రక్షణ కొనసాగనుంది.

65 ఏళ్లకు పెంచితే ప్రయోజనం

పథకంలో నమోదైన వారికి సంబంధించిన ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే జీవిత బీమా సంస్థకు చెల్లిస్తుంది. పథకంలో నమోదై ఉండి, ఏ కారణంతో అయినా రైతు మృతి చెందితే కుటుంబానికి రూ.5లక్షల బీమా పరిహారం అందుతుంది. పథకం మొదలైన 2018వ సంవత్సరం నుంచి జిల్లాలో 5,369 మంది రైతులు మృతిచెందగా వీరికి రూ.262.60 కోట్ల పరిహారం చెల్లించారు. ఇటీవల కాలంలో మృతిచెందిన జిల్లాలోని కొందరు రైతుల కుటుంబాలకు పరిహారం రావాల్సింది ఉంది. 2024–25లో 839 మంది రైతులు మృతి చెందగా 730 మందికి మాత్రమే రైతు బీమా పరిహారం అందింది. మిగతా వారికి బీమా పరిహారం అందాల్సి ఉంది.

గతేడాదికి సంబంధించి బీమా డబ్బులు రావాల్సి ఉంది



2025–26 సంవత్సరానికి గాను రైతుబీమా పథకంలో జిల్లావ్యాప్తంగా 1,63,480 మంది నమోదయ్యారు. 2024–25 సంవత్సరానికి గాను జిల్లాలో మృతిచెందిన కొంత మంది రైతులకు బీమా డబ్బులు రావాల్సి ఉంది.

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పథకం అమలు ఇలా..

సంవత్సరం	నమోదు	మృతులు	పరిహారం (రూ.కోట్లలో)
2018-19	1,27,486	608	30.40
2019-20	1,30,524	639	31.95
2020-21	1,31,571	981	49.05
2021-22	1,41,925	772	38.60
2022-23	1,51,135	726	36.20
2023-24	1,58,860	804	39.90
2024-25	1,63,549	839	36.50
2005-26	1,63,480	-	-

సాగర్‌కు పెరిగిన వరద ఉధృతి

నాగార్జునసాగర్ : సాగర్‌కు ఎగువనుంచి వరద ఉధృతి పెరిగింది. శనివారం ఎగువ నుంచి సాగర్‌కు 2,50,487 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఆదివారం సాయంత్రం 3,41,558 క్యూసెక్కులకు పెరిగింది. సాగర్ నుంచి 26 క్రస్ట్‌గేట్లు, విద్యుదుత్పాదనతో 2,89,876 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమకాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాల్వలలకు 15,675 క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదనంతా విడుదల చేస్తున్నారు.



26 గేట్ల ద్వారా పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

క్లుప్తంగా

ఆపరేషన్ వికటించి బాలుడి మృతి


ప్రణయ్ (ఫైల్)

మర్రిగూడ: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించగా.. ఆపరేషన్ వికటించి శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన బల్లెం అబ్బయ్య, స్వరూప దంపతులకు ఇద్దరులు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారి పెద్ద కుమారుడు బల్లెం ప్రణయ్(11) గత రెండు సంవత్సరాల నుంచి తలసేమియా వ్యాధిలో బాధపడుతున్నాడు. ప్రణయ్‌కు ఆపరేషన్ అవసరమని డాక్టర్లు నిర్ధారించారు. ఆపరేషన్‌కు రూ.25లక్షలు అవసరం కాగా.. అందులో రూ.20లక్షలు ప్రభుత్వం ఇవ్వగా.. మరో రూ.5లక్షలు ఇచ్చేందుకు ఇందుర్తి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ముందుకు రావడంతో ఆపరేషన్ కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం బాలుడికి వైద్యులు ఆపరేషన్ చేయగా.. ఆపరేషన్ వికటించి మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు విలపించారు.

బావిలో దూకి వివాహిత ఆత్మహత్య


సరిత (ఫైల్)

మోత్కూరు: అనారోగ్య సమస్యలు, మానసిక స్థితి సక్రమంగా లేని వివాహిత బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుజిలాపురం గ్రామానికి చెందిన కాసగాని వెంకన్నకు గుండాల మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సరిత(35)తో 2010లో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకన్న వ్యవసాయం, కల్లు గీసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సరిత ఆదివారం తెల్లవారుజామున తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఇంట్లో భార్య కనిపించకపోవడంతో వెంకన్న గ్రామస్తులతో కలిసి బావి దగ్గరకు వెళ్లి చూడగా సరిత మృతదేహం కనిపించింది. తమ కుమార్తె కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుందని, అంతేకాకుండా ఆమె మానసిక స్థితి సక్రమంగా లేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో మృతురాలి తండ్రి వల్లందాసు చంద్రయ్య పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ కె. సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్లపొదల్లో నవజాత శిశువు గుర్తింపు


నవజాత శిశువు

మునగాల: మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ఇంటి ఆవరణలోని చెట్ల పొదల్లో ఆదివారం మధ్యాహ్నం నవజాత మగ శిశువును గ్రామస్తులు గుర్తించారు. గ్రామంలోని ఆర్ఎంపీ వైద్యురాలి ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో నుంచి శిశువు ఏడుపు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా.. అప్పుడే పుట్టిన మగ శిశువును గుర్తించారు. పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్ద శిశువుకు ప్రథమ చికిత్స చేయించి హుటాహుటిన సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కొక్కిరేణి గ్రామానికి చెందిన ఓ యువతి ప్రసవం కోసం తిమ్మారెడ్డిగూడెంలోని ఆర్ఎంపీ వైద్యురాలి వద్దకు రాగా.. ఆమె అందుబాటులో లేకపోవడంతో సదరు యువతి బిడ్డకు జన్మనిచ్చి అక్కడే వదలి వెళ్లినట్లు తెలిసింది.

స్పీడ్‌గా తపాలా సేవలు

- నేటి నుంచి నిలిచిపోనున్న రిజిస్టర్ పోస్ట్


సూర్యాపేటలోని తపాలా కార్యాలయం

నాగారం: రిజిస్టర్ పోస్ట్ అనేది ప్రజలకు తపాలా శాఖ అందించిన అత్యుత్తమమైన సేవ. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ కాల్ లెటర్ రావాలన్నా, ఉద్యోగం నియామక పత్రం అందాలన్నా, బంధుమిత్రులకు ప్రధాన వర్తమానం, సంస్థలు, కార్యాలయాలకు ముఖ్యమైన పత్రాలు పంపాలన్నా ఒకప్పుడు రిజిస్టర్ పోస్టే ఆధారం. ఒక రకంగా చెప్పాలంటే రిజిస్టర్ పోస్ట్ అంటే ఓ భరోసా. స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ లేని రోజుల్లో ప్రజల జీవితాలతో అది విడదీయరాని బంధాన్ని రిజిస్టర్ పోస్ట్ ఏర్పరచుకుంది. ముఖ్యమైన పత్రాలు, వస్తువులను ఒక చోటు నుంచి మరోచోటుకు సురక్షితంగా, నమ్మకంగా పంపించడానికి ప్రధాన మార్గంగా నిలిచింది. రాఖీలు, చిన్నచిన్న వస్తు సామగ్రి, లీగల్ నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్‌కు సంబంధించిన పత్రాలు ఇలా ఎన్నో విలువైన పత్రాలను పంపడానికి ఎంతగానో ఉపయోగపడింది. పంపిన వస్తువులు, పత్రాలు అవతలి వారికి చేరినట్లు రశీదు పొందితే.. హమ్మయ్య అని గుండెలపై చేయి వేసుకునే వారెందరో ఆ రోజుల్లో. అలాంటి సేవలు ఇక నుంచి కాలగర్భంలో కలిసిపోనున్నాయి. సోమవారం నుంచి రిజిస్టర్ పోస్ట్ సేవలను నిలిపివేస్తున్నట్లు భారత తంతి తపాలా శాఖ ప్రకటించింది. దాని స్థానంలో స్పీడ్ పోస్ట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది.

కాలానుగుణంగా మార్పులు..

మారుతున్న కాలానికి అనుగుణంగా భారత తంతి తపాలా శాఖ కూడా మారుతోంది. ప్రైవేట్ సంస్థలతో పోటీపడుతూ ఇప్పటికే ఎన్నో సేవలను ప్రవేశపెట్టి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న పోస్టల్ శాఖ.. అంతే వేగంగా స్పీడ్ పోస్ట్ విధానానికి శ్రీకారం చుడుతోంది. బ్రిటీష్ కాలం నుంచి కొనసాగుతున్న రిజిస్టర్ పోస్ట్ సేవలను స్పీడ్ పోస్ట్‌లో కలుపుతున్నట్లు భారత తంతి తపాలా శాఖ ప్రకటించింది. ప్రజలు తాము పంపిన వస్తువులు, పత్రాలు ఎక్కడి వరకూ చేరుకున్నాయనే సమాచారాన్ని తెలుసుకునే వెసులుబాటు కల్పించడానికి ట్రాకింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ స్పీడ్ పోస్ట్ విధానంతో తంతి తపాలా శాఖ అధునాతన కొరియర్ వ్యవస్థలకు పోటీగా సేవలు అందిస్తుందన్న అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతుతోంది.

యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం


యాదగిరిగుట్టపై ఉత్తర మాడ వీధిలో కిటకిటలాడుతున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూకాంప్లెక్స్, క్యూలైన్లు, ముఖ మండపం క్యూలైన్, మాడ వీధులు, ఆలయ పరిసరాలు భక్తులతో నిండుగా కనిపించాయి. స్వామివారి ధర్మ దర్శనానికి మూడు గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.26,52,441 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

నృసింహుడి కల్యాణం


యాదగిరీశుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: కెనడా దేశ రాజధాని ఒట్టావా నగరంలో శనివారం రాత్రి యాదగిరి లక్ష్మీనరసింహాస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ కెనడా అసోసియేషన్ ఆహ్వానం మేరకు రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో ఆగస్టు 22న కెనడా దేశానికి యాదగిరిగుట్ట ఆలయ విశ్రాంత ప్రధానార్చకుడు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, ఆలయ అధికారి గజివెల్లి రఘు వెళ్లారు. 23న విండ్సర్, 24న టొరంటో నగరంలో కల్యాణ వేడుకలను నిర్వహించారు. శనివారం రాత్రి ఒట్టావా నగరంలో నిర్వహించిన యాదగిరీశుడి కల్యాణోత్సవంలో హిందూ ధర్మ ప్రచారకులు చంద్ర ఆర్య, మాజీ ఎంపీ కరుణాకరరెడ్డి, టీసీఏ అధ్యక్షులు శ్రీనివాస్ మన్నెంతో పాటు భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు


పట్టుబడిన నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొండమల్లేపల్లి: డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు.. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బి. సంతోష్‌రెడ్డి ఆదేశాల మేరకు నల్లగొండ, దేవరకొండ ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా కొండమల్లేపల్లి మండలం చెన్నారం గేట్ వద్ద ఆదివారం తెల్లవారుజామున వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి దేవరకొండకు డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 60క్వింటాళ్ల నల్లబెల్లం, 100 కిలోల పటికను పట్టుకున్నారు. పట్టుబడిన నల్లబెల్లం, పటికను సీజ్ చేసి దేవరకొండ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, అందులో ఒకరు అరెస్ట్ చేయగా.. ముగ్గురు పరారీలో ఉన్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. కేసు నమోదైన నలుగురిలో ఇద్దరు కొండమల్లేపల్లి మండల పరిధిలోని మేఘ్యా తండాకు చెందిన వారు కాగా.. మరొకరిది ఏపీలోని గుంటూరు, ఇంకొకరిది కర్ణాటక రాష్ట్రంలోని బీదర్‌కు చెందిన వారని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ నరసింహ, కానిస్టేబుళ్లు శేఖర్‌రెడ్డి, నాగరాజు, అనిల్‌కుమార్, ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడి.. గొర్రెలు మృతి

చిట్యాల: చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన బైకాని లింగస్వామి మేకల దొడ్డిపై, ఏర్పుల రామనర్సింహకు చెందిన గొర్రెల దొడ్డిపై ఆదివారం కుక్కలు దాడి చేశాయి. కుక్కల దాడిలో బైకాని లింగస్వామికి చెందిన నాలుగు మేకలు, ఏర్పుల రామనర్సింహకు చెందిన రెండు గొర్రెలు మృతిచెందాయి. మృతిచెందిన మేకలు, గొర్రెల విలువ సుమారు రూ.60వేలకు పైగా ఉంటుందని బాధితులు తెలిపారు.

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి


గౌరవ సూచికంగా గాల్లోకి కాల్పులు జరుపుతున్న సీఆర్‌పీఎఫ్ పోలీసులు

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూర్(ఎస్) మండలం ఎనుబాముల గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ కలకోట్ల శ్రీను(47) శనివారం చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆదివారం స్వగ్రామం ఎనుబాములలో సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి సీఆర్‌పీఎఫ్ అధికారులు తమ సిబ్బందితో వచ్చి మృతుడి భార్య మంజులకు జాతీయ జెండాతో పాటు అతడి దుస్తులు, బ్యాడ్జీ రూ.75 వేల నగదు అందజేశారు. శ్రీను భౌతికకాయంపై జాతీయ జెండా కప్పారు. అనంతరం గాల్లోకి 3 రౌండ్లు ఫైరింగ్ చేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మాజీ సైనికుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎస్ఎల్ నాయక్, యాదయ్య, సోమయ్య, నాగయ్య, జనిమియా, చంద్రయ్య, సూర్యాపేట మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మందికి గాయాలు

నకిరేకల్: నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. నల్లగొండ మండలం చందంపల్లికి శివకుమార్, శరత్‌కుమార్ నకిరేకల్ నుంచి తమ స్వగ్రామానికి బైక్‌పై ఆదివారం రాత్రి 7.30 గంటల సమయంలో వెళ్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన సయ్యద్ జుబేర్ నల్లగొండ నుంచి నకిరేకల్‌కు వస్తున్నాడు. వీరి బైక్‌లు నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో హైవేపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జుబేర్, శివకుమార్, శరత్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న నకిరేకల్ 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జుబేర్, శివకుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

డివైడర్‌ను ఢీకొని..

భువనగిరి: బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొని ముగ్గురి యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన భువనగిరి మండలంలోని అనంతారం బ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన గుండబోయిన వెంకట్, ఎండీ అఫ్రోజ్, దామన్ శనివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని చూసేందుకు బైక్‌పై వెళ్లారు. తిరిగి రాత్రి వరంగల్‌కు బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున భువనగిరి మండలంం అనంతారం గ్రామం వద్ద బ్రిడ్జి వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయారు. స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ముగ్గురు యువకులను భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రెండు బైకులు ఢీ..

రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఆదివారం మధ్యాహ్నం బీబీనగర్ మండలం జంపల్లి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో చౌటుప్పల్ నుంచి భువనగిరి వైపు మహమ్మద్ గౌస్ అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా.. భువనగిరి మండలం సిరివేణికుంట గ్రామ స్టేజీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి


మాట్లాడుతున్న మందకృష్ణ

నల్లగొండ టౌన్: దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఆదివారం నల్లగొండలోని ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన చేయూత పింఛన్‌దారుల సభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు కనీసం మాట్లాడడం లేదన్నారు. తాను గుడిసెలో పుట్టిన బిడ్డగా పింఛన్‌దారుల పక్షాన పోరాటానికి ముందుకొచ్చానని తెలిపారు. పింఛన్ల మొత్తం పెరిగేంత వరకు పోరాటం ఆగదన్నారు. ఈ నెల 3న హైదరాబాద్‌లో జరిగే చేయూత పింఛన్‌దారుల మహాగర్జనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొత్త వెంకన్నయాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుముల జలంధర్, గద్దం కాశీం, పెరిక శ్రీనివాస్, బకరం శ్రీనివాస్, ఇరిగి శ్రీశైలం, దాసరి లక్ష్మమ్మ, రెడ్డిమాస్ ఇంద్రచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం


గౌతమ్ (ఫైల్)

మఠంపల్లి: బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మఠంపల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి గౌతమ్(17), అతడి స్నేహితులు పవన్, సాయి ఆదివారం రాత్రి బిర్యానీ తెచ్చుకునేందుకు మఠంపల్లి మండల కేంద్రానికి బైక్‌పై వచ్చారు. తిరిగి బైక్‌పై చౌటపల్లి వెళ్తుండగా.. మట్టపల్లిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసి మఠంపల్లి మండల కేంద్రంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న గౌతమ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పవన్ పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం ఖమ్మంకు తరలించారు. స్వల్ప గాయాలైన సాయి హుజూర్‌నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మఠంపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గౌతమ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి విచారణ జరుపుతున్నారు.


ఎవరా అదృష్టవంతులు..


బంగారు ప్రతిమ


రెడ్డికాలనీలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో నవయుగ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద రూ.1.15లక్షలతో 24 క్యారెట్ల బంగారంతో చేసిన చిన్న వినాయక ప్రతిమను ఉంచి నిత్యం పూజలు చేస్తున్నారు. గత 14 ఏళ్లుగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది మొదటి సారి బంగారు ప్రతిమను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. లడ్డుకు రూ.116, బంగారు ప్రతిమకు రూ.516తో లక్కీ డ్రా ఏర్పాటు చేశామని, డ్రాలో గెలుచుకున్న వారికి బంగారు వినాయకుడి ప్రతిమ ఇవ్వనున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు చిట్టిపోలు మట్టపల్లి, సభ్యులు తెలిపారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో


మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఆదివారం అధికారులు నాలుగు క్రస్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం రాత్రి వరకు 6,525 క్యూసెక్కుల నీరు మూసీ రిజర్వాయర్‌కు వస్తోంది. క్రస్టు గేట్ల ద్వారా 5,625 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 96 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 144 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 643.80 అడుగుల మేర నీటి మట్టం ఉంది.

బైక్ ఢీకొని వలస కూలీ మృతి

చౌటుప్పల్ రూరల్: రోడ్డు దాటుతున్న వ్యక్తులను బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన గున్నల్(30) తన భార్యతో కలిసి మూడు నెలల క్రితం చౌటుప్పల్ మండలం ఆరెగూడెం వలస వచ్చి గ్రామ పరిధిలోని టింబర్ డిపోలో పనిచేస్తున్నాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికే చెందిన మరో వలస కార్మికుడు గుడ్డు మరో టింబర్ డిపోలో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో గున్నల్, గుడ్డు చౌటుప్పల్‌కు వెళ్లి సరుకులు తీసుకొని ఆటోలో ఆరెగూడెం గ్రామ స్టేజీ వరకు వచ్చారు. టింబర్ డిపోకు వెళ్లడానికి హైవే దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న బైక్ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గున్నల్ అక్కడికక్కడే మృతిచెందాడు. గుడ్డు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. గున్నల్ తన భార్యను వారం క్రితం స్వగ్రామానికి పంపించి ఒక్కడే టింబర్ డిపోలో ఉంటున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పటేల్ శ్రీధర్‌రెడ్డి కృషి అభినందనీయం

- కవి అందెశ్రీ


పటేల్ శ్రీధర్‌రెడ్డికి బొకే ఇచ్చి అభినందిస్తున్న అందెశ్రీ

సూర్యాపేట: స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి, 25 ఏళ్లుగా నిరక్షరాస్యత నిర్మూలనకు పటేల్ శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ కవి అందెశ్రీ అన్నారు. సూర్యాపేట జిల్లా బాలెంల గ్రామానికి చెందిన స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పటేల్ శ్రీధర్‌రెడ్డి అమెరికాలోని మేరీలాండ్ స్టేట్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఆదివారం ఆయనకు సూర్యాపేట పట్టణంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు అందెశ్రీతో పాటు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కవి అందెశ్రీ మాట్లాడుతూ.. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వయోజన విద్య కేంద్రాలు నెలకొల్పి అనేక మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత శ్రీధర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సూర్యాపేట నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్ప్రెడ్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా ఏడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందిస్తుండడం గొప్ప విషయమన్నారు. బాలెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, గ్రీన్ బోర్డులు, బెంచీలు అందజేయడంతో పాటు సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కళావేదిక, వంటగదులు, మోడల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారని, రెండు ఎకరాల ఉచితంగా అందించి క్రీడా స్థలాన్ని, బాస్కెట్ బాల్ కోర్టు నిర్మించారన్నారు. శ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో పాటు ప్రభుత్వ సహకారంతో రూ.45 లక్షలతో శిథిలావస్థకు చేరిన సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

తిప్పర్తి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడెం గ్రామంలో ఆదివారం జరిగింది. తిప్పర్తి ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నగడ్డలగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ రవి(42) తన భార్య వేరొక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో తరచూ ఆమెతో గొడవపడుతుండేవాడు. పెద్దమనుషులు సర్ది చెప్పినప్పటికీ గొడవలు సద్దుమణగలేదు. ఆదివారం కూడా రవి తన భార్యతో గొడవపడగా.. ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రవి తల్లిదండ్రులు గమనించి చుట్టుపక్కల వారి సహాయంతో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి నర్సింగ్ సువార్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వయ్యారిభామతో ప్రమాదమే

- ఈ కలుపు మొక్కతో పంటలకు నష్టం
- పూత దశకు ముందే తొలగించాలి
- రైతులకు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సూచనలు

పొలం పంట


వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కలు

త్రిపురారం : పొలంలో వచ్చే తెగుళ్లు, చీడపీడలకంటే రైతులు అధికంగా భయపడేది వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కతోనే. ఈ మొక్కలు ఎక్కడైనా పెరిగే లక్షణం ఉంటుంది. ఈ కలుపు మొక్క ప్రధాన పంటలకు తీవ్రంగా నష్టం కలిగిస్తుంది. మొలిచిన నెల రోజుల్లోనే పూతకు వస్తుంది. ఒక్కో పార్థీనియం మొక్క 50 వేల విత్తనాలను ఉత్పత్తి చేయడంతోపాటు దూర ప్రాంతాలకు సైతం త్వరగా విస్తరిస్తుంది. ఈ కలుపు మొక్క లక్షణాలు, నివారణ చర్యల గురించి కేవీకే కంపాసాగర్ సేద్యపు విభాగం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ మాటల్లోనే..

మనుషులు, పశువులకూ హాని..

వయ్యారిభామ కలుపు మొక్క వల్ల పంటలకే కాకుండా మనుషులు, పశువులకు కూడా ప్రమాదమే. మనుషులకు జ్వరం, ఉబ్బసం వంటి వ్యాధులు సోకడంతో పాటు చర్మ వ్యాధులు వస్తాయి. జలుబు, కళ్ల ఎర్రబడడం, కనురెప్పల వాపు తదితర సమస్యలు తలెత్తుతాయి. ఈ మొక్కలు తిన్న పశువులు హైపర్ టెక్షన్‌కు గురవుతాయి. పశుగ్రాసాల పంటలకు కూడా నష్టం కలిగిస్తాయి. ఇక పంటలకు నీరు పోషకాలు అందకుండా వాటి కంటే ముందే ఈ మొక్కలు గ్రహించుకుంటాయి. తద్వారా పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపి సుమారు 40 శాతం మేర తక్కువ దిగుబడులు వస్తాయి. వంగ, మిరప, టమాట, మొక్కజొన్న పైర్లు పూత దశలో ఉన్నప్పుడు వాటిపై వయ్యారిభామ పుప్పొడి పడడం వల్ల ఉత్పత్తి తగ్గుతుంది. పైర్లకు మొవ్వ, కాండం కుళ్లు తెగుళ్ల సోకే ప్రమాదం ఎక్కువ. పార్థీనియం మొక్కను నిర్మూలించడానికి రైతులు తప్పనిసరిగా సమగ్ర యాజమాన్య సంరక్షణ చర్యలు చేపట్టాలి.

తొలగించే విధానం

పార్థీనియం మొక్కలు తక్కువ సంఖ్యలో ఉంటే పూత దశకు రాకముందే తొలగించి మంటల్లో కాల్చివేయాలి. లేకపోతే ఈ మొక్కలు ముదిరితే వాటి వ్యాప్తిని నివారించడం చాలా కష్టంగా ఉంటుంది. ఒకవేళ పూత దశకు చేరుకున్న మొక్కలను తొలగించాలంటే చేతులకు గ్లౌజులు, ముక్కుకు మాస్కులు ధరించాలి. తీసిన మొక్కలను కుప్పగా వేసి కాల్చివేయాలి. రసాయనాలతో మొక్కజొన్న, చిరుధాన్యాల పంటల్లో విత్తనాలు మొలక రాకముందు లీటర్ నీటికి 4 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేసుకుంటే వయ్యారిభామ మొక్కల బెడద ఉండదు. విత్తనాలు మొలకెత్తిన 15 నుంచి 20 రోజులకు లీటర్ నీటికి 2 ఎంఎల్ పేర్వాక్వాట్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి. పశుగ్రాసాలు సాగు చేసుకునే రైతులు పంట వేయకముందే లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున అట్రాజిన్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

కంపోస్టుగా తయారుచేసుకోవచ్చు

వయ్యారిభామ కలుపు మొక్కలు ఎంతో ప్రమాదకరమైనప్పటికి వాటిని ఉపయోగించుకొని కంపోస్టు ఎరువును తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం నీరు నిలవని చోట 3 మీటర్ల లోతు, 6 మీటర్ల వెడల్పు, 10 మీటర్ల పొడవు ఉండేవిధంగా గుంత తవ్వుకోవాలి. ఇందులో 50 కిలోల వయ్యారిభామ మొక్కలు వేసి వాటిపై 5 కిలోల యూరియా, 50 గ్రాముల ట్రికోడెర్మావిరిడి చల్లుకోవాలి. ఈ విధంగా పొరలుగా గుంతను డోము ఆకారంలో నింపుకోవాలి. పొరలపైన పేడ, మట్టి, ఊక మిశ్రమాన్ని వేసి కప్పేసుకోవాలి. ఈ కంపోస్టులో నత్రజని, భాస్వరం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇలా తక్కువ ఖర్చుతో చేసుకొని అన్ని పంటలకు సేంద్రియ ఎరువుగా వినియోగించుకోవచ్చు.